పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీలే కీలకం



సమావేశంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: సీఎం ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీలే ఇకనుంచి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలకం కానున్నాయని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సమావేశం శ్రీ కృష్ణ కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో మరింత విశ్వాసం కలిగించడంతో పాటుగా పారదర్శకంగా ఉండేందుకు ఈ కమిటీలు దోహదపడతాయన్నారు. త్వరలోనే డివిజన్ ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సీతారాంరెడ్డి, నాగిళ్ల బాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్‌రాజ్‌గౌడ్, సత్తిరెడ్డితో పాటుగా పలువురు పాల్గొన్నారు.



ఎంపీర్ జన్మదిన వేడుకల్లో కార్పొరేటర్..

ఎంపీఆర్ జన్మదిన వేడుకలు..

అనంతరం ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు.

నాచారం ఎస్టీపీని పరిశీలించిన ఎమ్మెల్యే



ఎస్టీపీ వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం ఎస్టీపీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, సాయిజెన్‌శేఖర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆదివారం ఈ ప్లాంట్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు.

మహాధర్నాలో కార్పొరేటర్

మౌలాలి : తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చేయి చేసిన కీడు.. మూసీ బాధితులకు బీజేపీ తోడు' అంటూ మూసీ బాధితులకు అండగా శుక్రవారం నిర్వహించిన బీజేపీ మహాధర్నాలో వినాయక్‌నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



బీజేపీ నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

ఈస్ట్ బాలాజీహిల్స్‌కాలనీ నూతన కమిటీ ఎన్నిక



మేయర్ అజయ్‌యాదవ్‌తో కాలనీ ప్రతినిధులు

బోడుప్పల్: ఈస్ట్ బాలాజీ హిల్స్ కాలనీ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ చైర్మన్‌గా వెలుగొండయ్య, అధ్యక్షుడిగా చంద్రంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా రఘు నాయక్, కోశాధికారిగా అంజయ్యగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జగన్‌రావు, కమిటీ సభ్యులుగా నారాయణ, వెంకట్, వేణు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ ప్రతినిధులు మేయర్ అజయ్‌యాదవ్‌ను కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, భూక్యా సుమన్ నాయక్‌ను కలిసి తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పోలీసునంటూ ఆటో డ్రైవర్‌కు బెదిరింపు

అల్వాల్: పోలీసునంటూ ఓ ఆటో డ్రైవర్‌ను బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని అల్వాల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అల్వాల్ సీఐ రాహుల్‌దేవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23వ తేదీ సాయంత్ర కానాజీగూడ ప్రాంతానికి నవీన్ నాయక్ అనే వ్యక్తి ఆటోలో వస్తుండగా అల్వాల్ వెంకటాపురం ప్రాంతానికి చెందిన ఆర్. నరేశ్ (25) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. నరేశ్ తాను పోలీస్‌నని చెప్పి నవీన్ నాయక్ ఆటోను ఆపి యూనిఫామ్ ధరించలేదని, సరైన పత్రాలు లేవని బెదిరించి అతని నుంచి రూ. 22 వేలు తీసుకొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్ఐ అంబికగౌడ్ నేతృత్వంలో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రూ. 2 వేలు, నేరానికి వినియోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ అంబికతో పాటు ఇతర సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఎంపీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ



ఎంపీఆర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్, విఠల్‌నాయక్ తదితరులు

కుషాయిగూడ: ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి బర్త్‌డే వేడుకల్లో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్, డివిజన్ అధ్యక్షుడు నాగేషు, మేడ్చల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, డైరెక్టర్ పూర్ణయాదవ్‌తో పాటు పలువురు నేతలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీఆర్‌తో కేక్ కట్ చేయించి ఆయన చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో నాయకులు పవన్‌కుమార్, నాగరాజు, శ్రీకాంత్‌గౌడ్, మల్లారెడ్డి, సత్యనారాయణ, శ్రీహరి, హరి, రాకేశ్‌యాదవ్, బాబురావు, సంతోష్, సతీశ్‌యాదవ్, సంతోష్‌చారి, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం..

రామంతాపూర్ : ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి బర్త్‌డేను పురస్కరించుకుని రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఫీక్, ఉప్పల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుర్వి మురళీగౌడ్, టీపీసీసీ ప్రతినిధి తౌఫీక్ శుక్రవారం ఆయనను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు మెజార్టీ స్థానాలు కైవసం చేసుకునేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రిలో పండ్ల పంపిణీ

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ఉప్పల్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొయలకొండ రాజేశ్ మల్లాపూర్ సూర్యనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు, బాలింతలకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రేటర్ సీనియర్ కాంగ్రెస్ నేత నెమలి అనిల్ కుమార్ హాజరయ్యారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నెమలి అనిల్



పరమేశ్వర్‌రెడ్డికి కేకు తినిపిస్తున్న నాయకులు



శ్రీనగర్ కాలనీలో పొంగుతున్న డ్రైనేజీ





ఇందిరానగర్ మార్కండేయ ఆలయం రోడ్డులో ..

అంతా మురుగుమయం..!

- బస్తీలు, కాలనీల్లో రోడ్లపైనే పారుతున్న డ్రైనేజీ నీరు
- 30 ఏళ్ల క్రితం నిర్మించిన చిన్న పైప్‌లైన్‌తోనే సమస్య
- ఇళ్లలోని సంపులు, బోర్‌వెల్ పంపుల్లోకి చేరుతున్న మురుగు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాలనీ, బస్తీలవాసులు

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని పలు కాలనీలు మురుగుమయంగా మారుతున్నాయి. ప్రధానంగా ఇందిరానగర్ హెచ్‌పీ గ్యాస్ వీధి, మార్కండేయ దేవస్థానం పరిసరాలు, శ్రీనగర్ కాలనీ హనుమాన్ దేవస్థానం వీధి ఓల్డ్ రామంతాపూర్, రామ్‌రెడ్డినగర్, వెంకట్‌రెడ్డినగర్, వాసవీనగర్ తదితర బస్తీలు, కాలనీల్లో భూగర్భ డ్రైనేజీలు పొంగిపొర్లుతూ దుర్వాసన వెదజల్లుతున్నాయి. 30 ఏళ్ల క్రితం అప్పటి జనాభాకు గృహాలకు అనుగుణంగా చిన్న పైప్ లైన్లతో భూగర్భ డ్రైనేజీలు నిర్మించారు. అయితే ప్రస్తుతం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సివరేజ్ పైప్‌లైన్ వ్యవస్థ లేదు.దీంతో మురుగు సమస్య ఏళ్లపాటు కొనసాగుతూనే ఉన్నది. ఇక వానకాలంలో అయితే చిన్న వర్షానికే డ్రైనేజీలు పొంగిపొర్లి మురుగు నీరు రోడ్లపైనే కాకుండా ఇళ్లలోని తాగునీటి సంపులు, బోర్‌వెల్ పంప్‌ల్లోకి వస్తున్నదని శ్రీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నేతలు వాపోతున్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని జల మండలికి ఫిర్యాదు చేస్తే తాత్కాలికంగా పనులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదని పలు కాలనీ, బస్తీల సంక్షేమ సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని తమను మురుగు సమస్య నుంచి కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తాం..



రామంతాపూర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం. ఎక్కువ సామర్థ్యం గల పెద్ద పైప్‌లైన్లతో డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం.

– బండారు శ్రీవాణి వెంకట్‌రావు, కార్పొరేటర్, రామంతాపూర్

ఇళ్లలోకి వస్తున్న డ్రైనేజీ నీరు..



శ్రీనగర్‌కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. దీంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహించడమే కాకుండా ఇళ్లలోని సంపులు, బోర్‌వెల్ పంప్‌ల్లోకి చేరి జలాలన్నీ కలుషితమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులపై ఒత్తిడి తెచ్చి పెద్ద భూగర్భ డ్రైనేజీలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– పాశం బాలరాజ్, శ్రీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు

ఐదో రోజూ గ్రూప్-1 మెయిన్స్ ప్రశాంతం

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని రెండు సెంటర్లలో ఐదోరోజూ గ్రూప్-1 మెయిన్స్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 1394 మంది అభ్యర్థులకు 917 మంది హాజరు కాగా, సెంటర్-1 లో 131 మంది, సెంటర్-2లో 346 మంది గైర్హాజరయ్యారు. దివ్యాంగ అభ్యర్థుల్లో 136 మందికి 93 మంది హాజరుకాగా, సెంటర్-1లో ఏడుగురు, సెంటర్-2లో 26 మంది పరీక్షకు హాజరు కాలేదని అధికారులు తెలిపారు.

ఓయూ వీసీకి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలియజేస్తున్న రాకేశ్ తదితరులు

మల్లాపూర్: ఉస్మానియా యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఎం. కుమార్‌ను ఆయన కార్యాలయంలో దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బొజ్జ రాకేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు విద్యార్థి నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



డ్రైనేజీ పనుల శంకుస్థాపనలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 5, 17వ డివిజన్లలో రూ 66.50 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏడో డివిజన్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్‌గౌడ్ నేతలు హరినాథ్‌రెడ్డి, విశ్వంగుప్తా పాల్గొన్నారు.

మై ఫ్లవర్ పార్క్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి

మల్లాపూర్: మై ఫ్లవర్‌పార్క్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తానని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మై ఫ్లవర్ అపార్ట్‌మెంట్‌వాసులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్య క్రమంలో కేశవరం ఆంజనేయులు, వేణునాథ్, కృష్ణ, మారుతీరావు, సుబ్రహ్మణ్యం, శ్రీరాంరెడ్డి, సురేశ్, రాంప్రసాద్, కృష్ణ మోహన్, కిశోర్, ఎంఎస్‌రావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అపార్ట్‌మెంట్‌వాసులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి..!

- చెత్త సేకరణపై ర్యాంకులు సాధించడంపై దృష్టి
- తడి, పొడి చెత్తను విడివిడిగా వేసేలా అవగాహన కార్యక్రమాలు
- ముందస్తు ప్రణాళికలతో అధికార యంత్రాంగం



సాక్షి,సిటీబ్యూరో: స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు సాధించేందుకు నగర శివారు పురపాలక సంఘాలు దృష్టి సారిస్తున్నాయి. గతంలో కంటే మెరుగ్గా రాణించేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి ఇవ్వాలని ప్రజలకు సూచించినా.. పురపాలికల్లో 60 నుంచి 70 శాతమే ఇస్తున్నట్లు క్షేత్ర స్థాయి పరిశీలనలో వెల్లడవుతోంది. కొన్ని పురపాలక సంఘాల్లో నైతే అసలే పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పటం లేదని తెలుస్తోంది. ఫలితంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకుల సాధించటంలో పలు పురపాలక సంఘాలు వెనుకబడి పోతున్నాయి. ఈ ఏడాది అలాంటి విధానానికి భిన్నంగా పుర అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇదంతా డిసెంబరు వరకు కొనసాగనుంది.

డివిజను, వార్డుల వారీగా ..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 29 పురపాలికల్లో 675 డివిజన్లు/ వార్డుల వారీగా ఇక నుంచి చైతన్య కార్యక్రమాలు నిర్వహించటానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారు. తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలో ప్రత్యేకంగా చూపించటంతో పాటు కరపత్రాలు, బ్రోచర్లను ఇంటింటికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భూమిలో కలిసిపోయే కూరగాయలు, ఇతర వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ఒక డబ్బాలో వేయాలని సూచించనున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, ఇనుప ముక్కలు, కాగితాలు, అట్టలు ఇతర పొడి వ్యర్థాలను మరో డబ్బాలో వేయాలని నిర్దేశించనున్నారు. పురపాలికల్లోని ప్రధాన రోడ్ల వెంబడి హోర్డింగులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తాచెదారాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పారేయకుండా అవగాహన కల్పించనున్నారు. పరిసరాల శుభ్రతపై విద్యా సంస్థల్లో పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మార్పు రావాలనే ఉద్దేశంతో..

స్వచ్ఛతకు వినియోగించే పురపాలిక వాహనాలు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది ఒకే డబ్బాలో చెత్త ఇవ్వకుండా అవగాహన కల్పించనున్నారు. అపార్టుమెంట్లు, కాలనీలు, గ్రేటెడ్ కమ్యూనిటీ ఏరియాలు, పారిశ్రామిక ప్రాంతాలు, ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రజల్లో విస్తృతంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా చెత్త సేకరణ విషయంలో మార్పు తీసుకురావాలని పురపాలక తగిన కార్యాచరణతో ముందుకు సాగేందుకు కసరత్తు చేస్తున్నారు.

మెరుగైన ర్యాంకు లక్ష్యంగా ..

స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఈసారి అవార్డు వచ్చేలా పురపాలక సంఘాలు పోటీ పడుతున్నాయి. గతంలో కంటే మెరుగైన ర్యాంకు సాధించిన పురపాలికలు రాష్ట్ర స్థాయిలో పోటీ పడేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లేందుకు కసరత్తు చేస్తున్నాయి. పట్టణ ప్రజలు కూడా చెత్త విషయంలో నిబంధనలు పాటించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని కోరుతున్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే ర్యాంకు తప్పక వస్తుందన్న పట్టుదలతో ముందడుగుకు సిద్ధమవుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 26న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటలో తెలిపారు.11 కేవీ ఏఎండీసీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఎన్ఎండీసీ కాలనీ, ఈస్ట్ ఆనంద్‌బాగ్, బ్యాంక్ కాలనీ, తాళ్లబస్తీ ప్రాంతాలు. అలాగే 11 కేవీ అనంతసరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అనంతసరస్వతీనగర్, షిరిడీనగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో, 11 కేవీ ఆర్కేనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు ఆర్కేనగర్, చాణుక్యపురి, వెస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాలు. 11 కేవీ బాలసరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాజీవ్‌గాంధీనగర్, విష్ణుపురికాలనీ, విమలాదేవీనగర్, శివపురి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పాలిటెక్నిక్ సబ్‌స్టేషన్ పరిధిలో..

రామంతాపూర్ : పాలిటెక్నిక్ సబ్‌స్టేషన్ పరిధిలో పీఎస్ కాలనీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సబ్‌స్టేషన్ ఏఈ రాములు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గుప్తా గార్డెన్ శ్రీనివాసపురం పీఎస్ కాలనీ, అదేవిధంగా విశాల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు విశాల్ బిల్డింగ్ ఏరియా సాయి గార్డెన్, గణేశ్‌నగర్, దూరదర్శన్, క్వార్టర్స్‌లో విద్యుత్ సరఫరా పేర్కొన్నారు.

చర్లపల్లి సబ్‌స్టేషన్–1 పరిధిలో..

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్–1, అంబేడ్కర్ నగర్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాబురావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్న చర్లపల్లి, చర్చ్‌కాలనీ, ఆర్‌జీకే–1,2, వీఆర్ కాలనీ, విద్యామారుతీనగర్, అంబేద్కర్‌నగర్, డీసీ కాలనీ, లక్ష్మీనగర్, నేతాజీనగర్, సిల్వర్‌వోక్ విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

చర్లపల్లి సబ్‌స్టేషన్–2 పరిధిలో..

చర్లపల్లి సబ్‌స్టేషన్–2, సాయినగర్ ఫీడర్ పరిధిలో చక్రీపురం మెయిన్‌రోడ్డు, నాగర్జుననగర్ కాలనీ రోడ్డు నెంబర్లు 1–6, సాయినగర్, సుభాష్‌నగర్, రెడ్డికాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బాలరాజు తెలిపారు.

కేపీఎల్‌రెడ్డినగర్‌లో కార్పొరేటర్ పర్యటన



మాట్లాడుతున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, అధికారులు

మల్లాపూర్: మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఇంజినీరింగ్, జలమండలి అధికారులతో కలిసి శుక్రవారం మల్లాపూర్ కేఎల్‌రెడ్డినగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీకి మంజూరైన సీసీ రోడ్డు, అవసరమైన చోట భూగర్భడ్రైనేజీ పైప్ లైన్ వంటి విషయాలపై చర్చించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాలని జలమండలి ఏఈకి సూచించారు. వారి వెంట ఇంజినీరింగ్ ఏఈ స్రవంతి, వాటర్ బోర్డ్‌మేనేజర్ సిరాజుద్దీన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, కాలనీవాసులు మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, యాకుబ్‌రెడ్డి, వాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మల్లాపూర్: ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీకి నిరసనగా తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య, ఉపాధ్యక్షుడు పీజీ సుదర్శన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పీ వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా అరెస్టు

అల్వాల్: వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను అల్వాల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఎస్. సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ సూర్యనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పశ్చిమ బెంగాల్ నుంచి యువతులను తీసుకువచ్చి గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు గురువారం రాత్రి ఇంట్లో సోదాలు చేయగా ఇద్దరు విటులు సతీశ్ (34), శివ చరణ్ (32) తో పాటు నిర్వాహకులు వెంకట సత్యనారాయణరెడ్డి, ఇద్దరు మహిళలు ఉన్నారు. వీరి నుంచి రూ. 90 వేలు, 4 సెల్‌ఫోన్లు, కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. మహిళలను సఖీ సెంటర్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశుగణన ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్



సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ పాడి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో పశుగణన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రారంభించారు. నాలుగు నెలల పాటు తలపెట్టిన పశుగణన కార్యక్రమంలో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కుక్కలు, కోళ్లతో సహా 16 రకాల జంతువుల లెక్కను పక్కాగా సేకరించనున్నారు. ప్రతి ఐదేళ్లకు ఓసారి దేశ వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో తాజా లెక్కలను కచ్చితంగా గణన చేయడానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 15 మండలాల్లో సంబంధిత అధికారులు తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులు సిబ్బందితో పాటు గోపాల మిత్రులు, ఇతర ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా ఈ గణనలో భాగస్వామ్యాన్ని పంచుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పక్కాగా పెంపుడు జంతువుల వివరాలు నమోదు చేయడానికి సిబ్బంది ఇంటింటికి వస్తారని, ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ గౌతమ్ కోరారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. సుధాకర్, సహాయ సంచాలకుడు డా. ప్రభు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.